త్వరలో ఉపాధిహామీ పనులపై సోషల్ ఆడిట్

మద్దూరు, ఫిబ్రవరి 25: మద్దూరు, దూళిమిట్ట మండలాల్లోని అన్ని గ్రామాల్లో 1 ఏప్రిల్ 2022 నుంచి 31 మార్చి 2023 ఆర్థిక సంవత్సరంలో నిర్వహించిన ఉపాధిహామీ పనులపై త్వరలో సామాజిక తనిఖీ నిర్వహించనున్నట్లు ఈసీ పరశురాములు ఆదివారం వెల్లడించారు. ఉమ్మడి మండలంలోని 23 గ్రామపంచాయతీల్లో నిర్వహించిన సుమారు 1,010 పనులకు గానూ సుమారు రూ.6 కోట్లపైగా ఖర్చు చేసిన నిధులకు ఒక ఎస్‌ఆర్పీ, 10 మంది డీఆర్పీల ఆధ్వర్యంలో విలేజ్ సోషల్ ఆడిటర్స్ (వీఎస్‌ఏ) సామాజిక తనిఖీ నిర్వహిస్తారని తెలిపారు.

కార్యదర్శులపైనే భారం


పోతరెడ్డిపేట గ్రామపంచాయతీ భవనం

గ్రామపంచాయతీల నిర్వహణలో ప్రేక్షక పాత్ర వహిస్తున్న ప్రత్యేకాధికారులు

సర్పంచుల పదవీ కాలం ముగియడంతో గ్రామ పంచాయతీల నిర్వహణ బాధ్యత మొత్తం కార్యదర్శులపైనే పడింది. పంచాయతీల ఆదాయానికి మించి నిర్వహణ ఖర్చులు ఉంటున్నాయి. అయితే దాదాపు ఏడాదిగా ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వకపోవడంతో సర్పంచులే ఎలాగోలా నెట్టుకొచ్చారు. ఇప్పుడు వారి పదవీకాలం ముగియడంతో కార్యదర్శులే అప్పులు చేసి, పంచాయతీలను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ప్రత్యేకాధికారులను నియమించినా ప్రేక్షక పాత్ర వహిస్తుండడంతో భారం మొత్తం కార్యదర్శులపైనే పడింది.

- సర్పంచుల పదవీ కాలం ముగియడంతో అవస్థలు
- గ్రామాలకు ఏడాదిగా నిలిచిపోయిన ప్రభుత్వ నిధులు
- అప్పులు చేసి నిర్వహిస్తున్న కార్యదర్శులు

దుబ్బాక, ఫిబ్రవరి 25: జిల్లాలో మొత్తం 499 గ్రామాలున్నాయి. అందులో మూడు కేటగిరిలుగా 328 మంది రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులు, 68 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (రెగ్యులర్ కావల్సినవారు), 32మంది ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులు పని చేస్తున్నారు. సర్పంచుల పదవీకాలం ఈ నెల 1న ముగిసింది. అంతకు 7 నెలల ముందు నుంచే సర్పంచులకు చెక్కుల ద్వారా చెల్లింపులను గత ప్రభుత్వం నిలిపివేసింది. అప్పటి నుంచి సర్పంచులు కూడా గ్రామాల్లో సమస్యల పరిష్కారంపై చేతులెత్తేశారు. గ్రామాల్లో లెక్కకు మించి తాము ఖర్చు చేసినా బిల్లులు రావడం లేదని పనులను చేపట్టడం నిలిపేశారు. దీంతో గ్రామంలో తప్పనిసరిగా వినియోగించాల్సిన ట్రాక్టర్ డీజిల్, పారిశుధ్య నిర్వహణ, నర్సరీ, డంపింగ్ షెడ్ నిర్వహణ, పల్లెప్రకృతి వనాలు, శ్మశానవాటికల నిర్వహణ, తాగునీటి సరఫరా, ట్యాంకుల క్లోరినేషన్ బాధ్యతలను గ్రామకార్యదర్శులే చేపట్టాల్సిన పరిస్థితి వచ్చింది. గ్రామపంచాయతీకి రావల్సిన పన్నుల వసూళ్లు అంతంత మాత్రంగానే ఉన్నా పనుల నిర్వహణకు తప్పని పరిస్థితిలో పంచాయతీ కార్యదర్శులే అప్పులు చేయక తప్పలేదు.




స్పెషల్‌డ్రైవ్ ద్వారా పారిశుధ్య పనులు నిర్వహింపజేస్తున్న కార్యదర్శి(ఫైల్)

కేంద్ర నిధులతో సరిపెట్టారు

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయాల్సిన నిధులను బీఆర్ఎస్ హయాంలో 20 నెలలుగా విడుదల చేయలేదు. ఎస్ఎఫ్‌సీ గ్రాంట్ ద్వారా జనాభా ప్రాతిపదికన రూ.68వేలు చిన్న గ్రామపంచాయతీకి అందాలి. అందులోనే సిబ్బంది జీతాలు, కరెంటు బిల్లులు, ట్రాక్టర్ డీజిల్, బ్లీచింగ్‌పౌడర్ కొనుగోలు, వీధిదీపాల నిర్వహణ ఖర్చులు చెల్లించాల్సి ఉంటుంది. 20 నెలల నుంచి గత ప్రభుత్వం నిధులను విడుదల చేయకపోవడంతో కొన్నాళ్లు గ్రామసర్పంచులే అప్పులు చేసి నిర్వహణ చేపట్టారు. వారికి కూడా గత ఏడు నెలల నుంచి చెక్కుల ద్వారా చెల్లింపులు నిలిపేయడం, వారి పదవీకాలం ముగియడంతో గ్రామకార్యదర్శులే భారం మోయాల్సిన పరిస్థితి ఏర్పడింది.

4నెలలుగా జీతాల్లేవ్..

పంచాయతీ కార్యదర్శులకు జీతాలు చెల్లించినప్పటికీ.. నాలుగు నెలలుగా ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శి ఉద్యోగులకు జీతాలు చెల్లించడం లేదు. ప్రభుత్వం సదరు ఏజెన్సీకి ఒక్కో కార్యదర్శి పేర రూ.18,200 వరకు చెల్లించినా.. కార్యదర్శికి కేవలం రూ.12,561 మాత్రమే ఏజెన్సీ నుంచి చెల్లిస్తున్నారు. అవి కూడా నాలుగు నెలల నుంచి రాకపోవడంతో వారికి ఇబ్బందులు తప్పడం లేదు. జూనియర్ కార్యదర్శులకు కూడా గత నెల జీతం చెల్లించలేదు. జీతాలు కూడా రాకపోవడంతో గ్రామ పంచాయతీల భారం మోయలేని పరిస్థితి ఏర్పడింది. ఇటీవలే ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులు సివిల్ సప్లై, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి, తమ సమస్యలను పరిష్కరించాలని విన్నవించారు.


మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి సమస్యలను విన్నవించిన ఔట్‌సోర్సింగ్ కార్యదర్శులు

కార్యదర్శులం కాదు.. వెట్టి కార్మికులం



ప్రభుత్వాలు మమల్ని వెట్టి కార్మికులుగా తయారు చేశాయి. జీతాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో పాటు గ్రామపంచాయతీ నిధులను సకాలంలో విడుదల చేయకపోవడంతో నిర్వహణ భారం మేమే మోయాల్సి వస్తున్నది. 20 నెలల నుంచి నిధులు ఇవ్వకపోవడంతో అప్పులు చేసి కార్యక్రమాలను నిర్వహిస్తున్నాము. సిబ్బందికి జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి ఉండడంతో వారు సహాయ నిరాకరణ చేపడితే తామే చీపురు పట్టి శుభ్రం చేసుకునే పరిస్థితి ఏర్పడింది. ప్రభుత్వం స్పందించి గ్రామపంచాయతీల నిర్వహణకు నిధులను ఎప్పటికప్పుడు కేటాయించాలి. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించి, ప్రతీనెలా విధిగా జీతాలివ్వాలి.

- నూకల నాగరాజు, పంచాయతీ కార్యదర్శి, ఎల్లాయిగూడ
(తెలంగాణ పంచాయతీ కార్యదర్శి సమాఖ్య జిల్లా అధ్యక్షుడు)

స్పెషల్ డ్రైవ్ ద్వారా జేబు గుల్ల

అసలే జీతాలు రాని కార్యదర్శులకు ప్రభుత్వం స్పెషల్ డ్రైవ్ ద్వారా పారిశుధ్య పనుల నిర్వహణ చేపట్టాలని హుకుం జారీ చేసింది. స్పెషల్ డ్రైవ్ కింద మురికి కాలువలు, తాగునీటి పైపులైన్లు, ప్రభుత్వ కార్యాలయాలను శుభ్రపరచడం, దోమల మందు పిచికారి చేయడంతో పాటు ప్రత్యేకంగా కూలీలను సమకూర్చి కూలీ చెల్లించాల్సి ఉంటుంది. చిన్న గ్రామపంచాయతీలకు సుమారు రూ.15 వేల వరకు స్పెషల్ డ్రైవ్‌కు ఖర్చయితే, ప్రజాపాలన ద్వారా రూ.10వేలను మాత్రమే ప్రభుత్వం చెల్లించింది. భోజనాల ఖర్చులు, నిర్వహణ ఖర్చులు, రోజువారి నిర్వహణకు చెల్లించలేదు. గృహజ్యోతి సర్వే, ఐహెచ్‌హెచ్ఎల్ (మరుగుదొడ్ల సర్వే)తో పాటు పలు పనులు చేపట్టినప్పటికీ నిర్వహణ ఖర్చులను చెల్లించలేదు. చిన్న గ్రామపంచాయతీల్లో సిబ్బంది జీతాలు కూడా సకాలంలో చెల్లించకపోవడంతో చాలా చోట్ల వారి నుంచి సహాయ నిరాకరణ ఎదురైంది. గ్రామానికి వివిధ శాఖల నుంచి కేటాయించిన స్పెషల్ అధికారులు కేవలం ప్రేక్షక పాత్ర వహిస్తుండడంతో కార్యదర్శులే అప్పులు చేసి అన్ని ఖర్చులు భరించాల్సిన పరిస్థితి ఏర్పడింది.

కాంగ్రెస్‌తో ఒరిగేదేమీ లేదు!

- ఆరు గ్యారంటీలను, సంక్షేమ పథకాలను అమలు చేసే సత్తా వారికి లేదు
- విజయ సంకల్ప యాత్రలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

గజ్వేల్/తూప్రాన్, ఫిబ్రవరి 25 : రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీతో ఒరిగేదేమీ లేదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కిషన్‌రెడ్డి విమర్శించారు. ఆదివారం గజ్వేల్, మెదక్ జిల్లా తూప్రాన్‌లో నిర్వహించిన విజయ సంకల్పయాత్రకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఆరు గ్యారంటీలు, సంక్షేమ పథకాలను అమలు చేసే సత్తా కాంగ్రెస్ పార్టీకి లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల తరువాత రాహుల్‌గాంధీ దేశంలో ఏడాది పాటు కనిపించడన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు దేశంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయలేవని, వారు గెలిచినా లాభం లేదన్నారు. నరేంద్రమోదీని మరోసారి ఆశీర్వదించాలని, మెదక్ లోక్‌సభ స్థానంలో బీజేపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కిషన్‌రెడ్డి కోరారు. తెలంగాణలో కేసీఆర్ కుటుంబం చేసిన అవినీతి, అక్రమాలు, మోసాలను తెలంగాణ బిడ్డలు భరించే పరిస్థితి లేదన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ అవినీతి, కుటుంబ పార్టీలని ఆయన ఆరోపించారు. ఈ రెండు భవిష్యత్తులో కలిసే పార్టీలంటూ కిషన్‌రెడ్డి వాఖ్యానించారు. కేంద్రంలోని బీజేపీ పార్టీని గద్దె దించేందుకు కుట్రలు జరుగుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రంలో వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో 17 స్థానాలకు 17 స్థానాలు గెలుస్తామని, హైదరాబాద్‌లో ఎంఐఎంను ఓడిస్తామని ధీమా వ్యక్తం చేశారు. దుబ్బాక మాజీ ఎమ్మెల్యే మాధవనేని రఘునందన్‌రావు తదితరులు పాల్గొన్నారు. అయితే తూప్రాన్‌లో విజయసంకల్ప యాత్రకు కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పాల్గొన్నా ప్రజలు అంతంతమాత్రమే హాజరయ్యారు. భారీ ఎత్తున బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ప్రకటించినప్పటికీ, సాధారణ స్థాయిలోనే కొనసాగింది. యాత్రలో ఉన్న జనాల కంటే పట్టణంలో రోడ్డుపై వెళ్లే ప్రజలే ఎక్కువగా కనిపించారు. మీడియాను సైతం ఆహ్వానించకపోవడం గమనార్హం.


నాచగిరిలో వేద పండితుల ఆశీర్వచనాలు పొందుతున్న కిషన్‌రెడ్డి

నాచగిరిలో అన్నప్రసాద హాల్ నిర్మాణానికి కృషి

వర్గల్: భక్తులు, ఆలయ అధికారుల కోరిక మెరకు నాచగిరి లక్ష్మీనర్సింహస్వామి క్షేత్రంలో అన్న ప్రసాద హాల్ నిర్మాణానికి కృషి చేస్తామని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా ఆయన నాచగిరి క్షేత్రాన్ని సందర్శించారు. ఆలయ అధికారులు, అర్చకులు వేద మంత్రోశ్చరణలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. క్షేత్రంలో భక్తుల సౌకర్యార్థం వసతులతో పాటు అన్నప్రసాద భవన నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. ఇటీవల నిర్మాణం పూర్తయిన రైల్వే స్టేషన్ క్షేత్రానికి దూరంగా ఉండడంతో భక్తులు వెళ్లలేని పరిస్థితులు నెలకొన్నాయని, క్షేత్రానికి సమీపంలో ఏర్పాటు చేయాలని భక్తులు మంత్రిని కోరగా.. అందుకు సహకరిస్తానని హామీ ఇచ్చారు. మంత్రిని ఆలయ కార్యనిర్వహణాధికారి అన్నపూర్ణ ఘనంగా సన్మానించారు. కిషన్‌రెడ్డి పండితుల ఆశీర్వచనాలు తీసుకున్నారు.

నేడు తొగుటలో విజయ సంకల్ప యాత్ర

తొగుట: తొగుట మండలంలో సోమవారం విజయ సంకల్ప యాత్ర కొనసాగుతుందని బీజేపీ మండలాధ్యక్షుడు చిక్కుడు చంద్రం తెలిపారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, దుబ్బాక మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు హాజరవుతున్నట్లు తెలిపారు. తొగుటలో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కోహెడలో నేడు ప్రజాహిత యాత్ర

హుస్నాబాద్, ఫిబ్రవరి 25: హుస్నాబాద్ నియోజకవర్గంలో సోమవారం నుంచి ఎంపీ బండి సంజయ్ నిర్వహించే రెండవ విడత ప్రజాహిత యాత్రను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బొమ్మ శ్రీరాంచక్రవర్తి కోరారు. ఆదివారం ఆయన హుస్నాబాద్ పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో మాట్లాడారు. సోమవారం ఉదయం కోహెడ మండలంలో యాత్ర ప్రారంభమవుతుందని, మంగళవారం హుస్నాబాద్‌లో కొనసాగుతుందని వెల్లడించారు. నియోజకవర్గంలో మూడు రోజుల పాటు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. మూడోసారి మోదీని ప్రధానిగా గెలిపించాలనే సంకల్పంతో ఈ యాత్ర చేపట్టినట్లు తెలిపారు. కరీంనగర్ ఎంపీగా బండి సంజయ్‌ను మరోసారి గెలిపించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో బీజేపీ పార్లమెంట్ ఇన్‌చార్జి మీసాల చంద్రయ్య, కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్‌రావు, అసెంబ్లీ ఇన్‌చార్జి సత్యనారాయణ, కన్వీనర్ లక్ష్మారెడ్డి, బీజేపీ మండలాధ్యక్షుడు రాజేంద్రప్రసాద్, పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, రామంచ మహేందర్‌రెడ్డి, కో కన్వీనర్ వేణుగోపాల్‌రావు, నాయకులు కోమటి సత్యనారాయణ, కాయిత అరుణ్‌రెడ్డి, తోట సమ్మయ్య, భీమేశ్వర్ పాల్గొన్నారు.

కొమురవెల్లిలో భక్తజన సందోహం


రాజగోపుర ఆవరణలో భక్తజన సందోహం

- ఆరో వారం హోరెత్తిన జాతర
- దర్శనానికి మూడు గంటల సమయం

7లో

పెరిగిన మల్లన్న లడ్డూ ప్రసాద ధర

- 100గ్రాముల పరిమాణం గల లడ్డూకు రూ.25

చేర్యాల, ఫిబ్రవరి 25 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ లడ్డూ ప్రసాద ధరను రూ.25కు పెంచారు. ముడిసరుకుల ధరలు పెరిగిన నేపథ్యంలో లడ్డూ ప్రసాద ధరను పెంచాలని కొన్ని రోజుల క్రితం ఆలయ వర్గాలు నిర్ణయించగా, దేవాదాయశాఖ కమిషనర్ అనుమతిచ్చారు. రూ.20కు విక్రయించిన 100గ్రాముల పరిమాణం గల లడ్డూను ఆదివారం నుంచి రూ.25 చొప్పున విక్రయాలు ప్రారంభించారు.


100 గ్రాముల పరిమాణం గల లడ్డూ ప్రసాదం

దొంగల బీభత్సం


గౌరాయపల్లి గ్రామంలో చోరీకి పాల్పడిన దుండగులు ఓ ఇంట్లోని వస్తువులను చిందరవందర చేసిన దృశ్యం (ఫైల్)

- తాళం వేసిన ఇళ్లే వారి టార్గెట్
- జిల్లాలో వరుస చోరీలకు పాల్పడుతున్న దుండగులు
- ఫిబ్రవరిలో ఇప్పటి వరకు 16 దొంగతనాలు
- విఫలమైన పోలీస్ నిఘా వ్యవస్థ

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 25: జిల్లాలో తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేసుకొని దుండగులు వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. వరుస చోరీలు జరుగుతుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. జిల్లాలో గత నెలలో 32 దొంగతనాలు, ఫిబ్రవరిలో 16 దొంగతనాలు జరిగాయి. వీటిలో 22 దొంగతనాల కేసులను చేదించినట్లు పోలీసులు చెబుతున్నారు.

ఒకేరోజు ఆరు ఇళ్లలో చోరీ

15 రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలోని మాహాశక్తి నగర్‌కు చెందిన సుమన్ అనే ఓ ప్రైవేటు బ్యాంకు మేనేజర్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో సహా తమ బంధువుల ఊరికి వెళ్లారు. తిరిగి వచ్చేసరికి ఇంటి తాళం పగులగొట్టి ఇంట్లో ఉన్న 35 తులాల బంగారు ఆభరణాలు చోరీ అయ్యాయి. అదేవిధంగా కొమురవెల్లి మండలం గౌరాయపల్లి గ్రామంలో ఈ నెల 12న రాత్రి 6 ఇళ్ల తాళాలు పగులగొట్టి సుమారు రూ.3,40,000 నగదు, 12 తులాల బంగారు ఆభరణాలు, 50 తులాల వెండి ఆభరణాలు దోచుకెళ్లారు. ఈ సంఘటన జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. ఆరు రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలోని రాఘవేంద్ర నగర్‌లో తాళం వేసిన ఇంట్లో దుండగులు చొరబడి దొంగతనానికి పాల్పడ్డారు. నాలుగు రోజుల క్రితం చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో తాళం వేసిన రెండు ఇండ్లలో దొంగతనం జరిగింది. వారం రోజుల క్రితం సిద్దిపేట పట్టణంలోని హౌసింగ్ బోర్డు కమాన్ వద్ద ఓ చికెన్ సెంటర్‌లో గుర్తు తెలియని వ్యక్తి యజమాని దృష్టి మరల్చి కౌంటర్‌లో ఉన్న రూ.మూడు లక్షలను ఎత్తుకెళ్లాడు.



ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలపై అనుమానం

ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కొంతమంది కూలీలే ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తున్నది. ప్రస్తుతం జాతరలు, పెండ్లిలు ఎక్కువగా ఉండడంతో ప్రజలు ఇళ్లకు తాళాలు వేసి వెళ్తున్నారు. అదునుగా భావించిన దుండగులు చోరీలకు పాల్పడుతన్నారు. పగటి పూట గ్రామాలు, పట్టణాల్లో తిరిగి తాళం వేసిన ఇళ్లను గుర్తించి రాత్రి వేళ చోరీలకు పాల్పడుతున్నటు సమాచారం. పోలీసులు రాత్రిపూట పెట్రోలింగ్ పక్కాగా చేయకపోవడం వల్లనే దొంగతనాలు జరుగుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సిద్దిపేటకు రైలు సౌకర్యం ఉండడంతో ఇతర ప్రాంతాల నుంచి రైలు ద్వారా దొంగలు జిల్లాకు చేరుకొని దొంగతనాలకు పాల్పడి దోచుకున్న సొమ్ముతో అదే రైలు మార్గం ద్వారా పారిపోతున్నట్లు సమాచారం. రైల్వే స్టేషన్‌లోనూ ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.


సిద్దిపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద పని చేయని సీసీ కెమెరాలు

ప్రత్యేక చర్యలు చేపట్టాం



జిల్లాలో జరుగుతున్న చోరీల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాము. రాత్రి పూట పెట్రోలింగ్, బ్లూ కోర్ట్ సిబ్బంది సంఖ్యను పెంచాం. అనుమానాస్పద వ్యక్తులను అదుపులోకి తీసుకుంటున్నాము. ఇంటికి తాళం వేసి జాతర్లకు, పండుగలకు, పెళ్లిల్లకు వెళ్లే వారు స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలి. విలువైన వస్తువులను ఇంట్లో పెట్టకూడదు. జిల్లాలో పని చేయని సీసీ కెమెరాలను మరమ్మతు చేయిస్తాం.

- బి.అనురాధ, సీపీ, సిద్దిపేట

పనిచేయని సీసీ కెమెరాలు

జిల్లాలో నిఘా వ్యవస్థను పటిష్టం చేసేందుకు సుమారు 5 వేలకు పైగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. పట్టణాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు కమిషనర్ కార్యాలయంలో ఉన్న కమాండ్ అండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. గ్రామాల్లో ఉన్న సీసీ కెమెరాలు గ్రామపంచాయతీలోని కంప్యూటర్‌కు అటాచ్ చేశారు. కానీ వాటి నిర్వహణను పోలీసులు పట్టించుకోవడం లేదు. దొంగతనం జరిగిన ప్రాంతంలో ఉన్న సీసీ కెమెరాలను పరిశీలిస్తే పనిచేయడం లేదు. సీసీ కెమెరాలకు మరమ్మతులు చేస్తే నేరాలు జరిగినప్పుడు నిందితులను గుర్తించడం సులభమవుతుందని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

మెదక్ ఆర్టీసీ బస్టాండ్‌లో చోరీ

● 8 తులాల బంగారు ఆభరణాలు అపహరణ
● పట్ట పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు



వివరాలు వెల్లడిస్తున్న బాధితురాలు రాణి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 25: ప్రయాణికురాలి పర్సు లోంచి బంగారు ఆభరణాలు అపహరణకు గురైన సంఘటన ఆదివారం మెదక్ ఆర్టీసీ బస్టాండ్‌లో చోటు చేసుకున్నది. బాధితురాలు మల్లికార్జున రాణి తెలిపిన వివరాల ప్రకారం... హవేళిఘణపూర్ మండల పరిధిలోని కూచన్‌పల్లి గ్రామానికి చెందిన రాణి ఎల్లారెడ్డి వెళ్లేందుకు మెదక్ బస్టాండ్‌కు వచ్చింది. బాన్సువాడ బస్సు రాగానే ఎక్కి పర్సులో చూసుకోగా అందులో 8 తులాల బంగారు ఆభరణాలు కనిపించలేదు. వెంటనే లబోదిబోమంటూ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. ఈ మేరకు బాధితురాలిచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

ఉపాధ్యాయుల పదోన్నతుల్లో సంక్షోభాన్ని తొలగించాలి

● టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి



టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కోశాధికారి

నర్సాపూర్, ఫిబ్రవరి 25: ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించడంతో పాటు కోర్టు కేసుల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ తీసుకుని ఉపాధ్యాయుల పదోన్నతుల విషయంలో ఉన్న సంక్షోభాన్ని తొలగించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నర్సాపూర్ యాదవ సంఘం భవన్‌లో నిర్వహించిన మెదక్ జిల్లా టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు అధ్యక్షత వహించగా ముఖ్యఅతిథిగా లక్ష్మారెడ్డి పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు వెంటనే మంజూరు చేయాలని, ఉపాధ్యాయులు, ఉద్యోగులకు నష్టం చేకూర్చే సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని తెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ కోసం మెగా డీఎస్సీ నిర్వహణకు నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. పాఠశాలలో పారిశుధ్య నిర్వహణకు సిబ్బందిని నియమించాలని తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి జ్ఞానమంజరి, జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మారావు, ఉపాధ్యక్షుడు అజయ్, కవిత, కోశాధికారి రవీందర్‌రెడ్డి, కన్వీనర్ నాగుల్‌మీరా, రాష్ట్ర కమిటీ సభ్యులు విశాలక్ష్మి, జిల్లా కార్యదర్శులు భీంలా, సుధాకర్, రవి, శేఖర్, శ్రీజ్యోతి, శేఖర్, యేసయ్య, షాకీర్‌అలీ, రమేష్, రాజు, గంగాధర్, కనకరాజు, భూషణం, శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

ఒకే ఈతలో రెండు దూడలు



రెండు దూడలకు జన్మనిచ్చిన ఆవు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 25: సాధారణంగా ఆవులు ఒక ఈతలో ఒక దూడకే జన్మనిస్తుంటాయి. కానీ సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండలం సంజీవన్‌రావుపేటలో దేవుడిపేరిట చాలారోజుల క్రితం వదిలిన ఆవు(గోమాత) ఆదివారం ఒకే ఈతలో రెండు దూడలకు జన్మనిచ్చింది. ఆ ఆవుకు ఇది ఆరో ఈత కాగా.. గత ఐదు ఈతల్లో ఒక్కో దూడలే జన్మించాయి. దేవుడికి వదిలిన ఆవు కావడంతో పాటు ఒకే ఈతలో రెండు దూడలు పుట్టడం దేవుడి మహిమేనని గ్రామస్థులు భావిస్తూ దూడలను తిలకిస్తున్నారు. ఆవుతో పాటు రెండు దూడలు ఆరోగ్యంగానే ఉన్నాయని మాజీ సర్పంచ్ ఎంబరి విఠల్ తెలిపారు.

పోటీల ద్వారానే ప్రతిభ వెలుగులోకి..



జహీరాబాద్‌లో విద్యార్థుల ప్రదర్శనలను తిలకిస్తున్న అతిథులు

జహీరాబాద్, ఫిబ్రవరి 25: విద్యార్థులకు పోటీలను నిర్వహించడం వల్లే వారిలో దాగిఉన్న ప్రతిభ బయటపడుతుందని ప్రొఫెసర్లు కాశీనాథ్, డా.రాధికాదేవి, వ్యాపారవేత్తలు అల్లాడి సాయికృష్ణ, బేజుగం రాజ్‌గోపాల్, డా. శివబాబు తదితరులు పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని శ్రామిక్ విజ్ఞాన్ కేంద్రం ఆధ్వర్యంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులతో ప్రభుత్వోన్నత పాఠశాలలో సైన్స్ ప్రాజెక్టు ప్రదర్శనల నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. పట్టణంలోని 27 పాఠశాలలకు చెందిన విద్యార్థులు 120 రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. విద్యార్థులు ప్రదర్శనార్థం తీసుకొచ్చిన ఆవిష్కరణలు అందరినీ ఆకట్టుకున్నాయని వివరించారు. విద్యార్థుల్లో పోటీతత్వం అత్యావసరమన్నారు. ఉత్తమ ప్రదర్శనలకు న్యాయ నిర్ణేతలు, ప్రముఖులు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో శ్రామిక్ విజ్ఞాన్ కేంద్రం ట్రస్టీ డా.విజయలక్ష్మి, ఉపాధ్యాయులు, నాయకులు రాంచందర్, అశోక్, రామచంద్రయ్య, యూసుఫ్, లక్ష్మి, సుమలత, సువర్ణ, పూలమ్మ, స్వేత, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, పవన్, ప్రభాకర్, ఫయిం, రాజు, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

బుదేరాలో సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ, నాయకులు

మునిపల్లి, ఫిబ్రవరి 25: మండలంలోని బుదేరా చౌరస్తాలో గల పోలీస్‌స్టేషన్ నుంచి ఐబీ వరకు ఎన్ఆర్ఈజీఎస్ రూ.10 లక్షల నిధులతో సీసీరోడ్డు పనులను ఆదివారం మాజీ ఎంపీపీలు రాజేశ్వర్‌రావు, రాంరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం వల్లే పల్లెలు, పట్టణాలు అభివృద్ధికి నోచుకోలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే అభివృద్ధి ఎలా ఉంటుందో చేసి చూపిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలాధ్యక్షుడు సతీష్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

జీపీఎఫ్ బకాయిలు రూ.6.50 కోట్లు

- 11 నెలలుగా బిల్లులు చెల్లించని వైనం
- ఇబ్బందుల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు
- కాంగ్రెస్ ప్రభుత్వమైనా సకాలంలో చెల్లించాలని విజ్ఞప్తి



మెదక్ జిల్లా పరిషత్ కార్యాలయం

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 25: భవిష్యత్తు అవసరాల కోసం దాచుకునే జీపీఎఫ్(జనరల్ ప్రావిడెంట్ ఫండ్) డబ్బులు గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల చేతికందలేదు. పిల్లల వివాహాలు, ఉన్నత చదవులు, వైద్య ఖర్చులు, ఇళ్ల నిర్మాణం తదితర అవసరాల కోసం దాచుకున్న డబ్బులను పొందేందుకు వారు నెలల తరబడి నిరీక్షిస్తున్నారు. డబ్బులు అవసరమై దరఖాస్తు చేసుకొని ట్రెజరీలో ఆంక్షల ఫలితంగా కార్యాలయాల చుట్టూ తిరుగుతూ ఎదురుచూస్తున్నారు. మెదక్ జిల్లాలో వివిధ రకాల లోన్లకోసం దరఖాస్తు చేసుకున్న ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికీ మెదక్ జిల్లాలో దాదాపు రూ.6.50 కోట్ల జీపీఎఫ్ నిధులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

అత్యవసర పరిస్థితులో అప్పులు చేస్తూ

జిల్లా ప్రజాపరిషత్ పరిధిలో పనిచేసే ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ భవిష్యత్తు అవసరాల కోసం జీపీఎఫ్ కింద డబ్బులు దాచుకుంటారు. ప్రతీ నెల వారి కనీస వేతనం నుంచి 6 శాతం ప్రీమియం కట్ అవుతుంది. ఇలా నెలవారీగా కట్ చేసిన సొమ్మంతా వారి జీపీఎఫ్ అకౌంట్‌లో జమవుతుంది. అందులోంచి ఉద్యోగ, ఉపాధ్యాయుల అవసరాల కోసం లోన్ తీసుకునే వెసులుబాటు ఉంది. లోన్ తీసుకున్న వారు ప్రతీనెల వాయిదాల పద్ధతిలో డబ్బులు చెల్లించాలి. 20 ఏళ్ల సర్వీస్ కలిగిన వారు జీపీఎఫ్ ఖాతాలో జమైన నగదులోంచి 60 శాతం వరకు పార్ట్ ఫైనల్‌గా తీసుకునే అవకాశం ఉంటుంది. ఈ మొత్తాన్ని తిరిగి చెల్లించాల్సిన అవసరం ఉండదు. రిటైర్డయిన ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వారి జీపీఎఫ్ ఖాతాల్లో జమైన మొత్తాన్ని ఫైనల్ పేమెంట్‌గా చెల్లిసారు. ఇదంతా బాగానే ఉన్నప్పటికీ గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలో పార్ట్‌ఫైనల్, ఫైనల్ పేమెంట్స్‌ను విడుదల చేయలేదు. దరఖాస్తు చేసుకొని నెలల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. జీపీఎఫ్ సొమ్ము చేతికందక అత్యవసరమైన పరిస్థితుల్లో బయట అప్పు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొంటుందని, ఉద్యోగ, ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధర్నా చేసినా.. ఫిర్యాదు ఇచ్చినా

జిల్లా పరిషత్ జీపీఎఫ్ విభాగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయుల సంఘాల ఆధ్వర్యంలో అనేక సందర్భాల్లో ధర్నాలు నిర్వహించి, రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్‌కు, జిల్లా ప్రజాప్రతినిధులకు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా జడ్పీ అధికారుల్లో మార్పు రాలేదు. ఈ విద్యాసంవత్సరం కూడా ఉపాధ్యాయులు తాము దాచుకున్న డబ్బుల కోసం పడరాని పాట్లు పడుతూనే ఉన్నారు. క్షేత్రస్థాయిలో జీపీఎఫ్ విభాగంలో ప్రతి ఏడాది ఇదే తంతు జరుగుతోందని పలువురు ఉపాధ్యాయులు తమ మనోభావాల్ని వెలిబుచ్చుతున్నారు. తక్షణమే పెండింగ్ బిల్లులను చెల్లించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు..

జిల్లా పరిధిలో ఉద్యోగ విరమణ పొందినవారు, ఆరోగ్యరీత్యా అవసరాల కోసం, ఇళ్ల నిర్మాణం, పిల్లల చదువులు, పెళ్లిళ్ల కోసం జీపీఎఫ్ విభాగానికి దరఖాస్తు చేసుకున్న వారి బకాయిలు దాదాపు రూ.6.50 కోట్లు ఉంటుందని లెక్కలు చెబుతున్నాయి. ఇప్పటికీ చాలా మంది ఉద్యోగ, ఉపాధ్యాయులు ట్రెజరీ, జీపీఎఫ్ కార్యాలయం చుట్టూ తిరుగుతూనే ఉన్నారు.

సకాలంలో ఇవ్వాలి

ఉద్యోగ, ఉపాధ్యాయులు కాంగ్రెస్ సర్కార్‌పై ఆశలు పెట్టుకున్నారు. వీరు దాచుకునే జీపీఎఫ్ సొమ్మును గత బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిరిగా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తే ప్రయోజనకరంగా ఉంటుందని వారు అభిప్రాయపడుతున్నారు. అవసరాల కోసం దాచుకున్న డబ్బులను సకాలంలో ఇవ్వకుంటే ఏం లాభమని పేర్కొంటున్నారు. పెండింగ్ బకాయిలను ప్రభుత్వం తక్షణమే విడుదల చేయాలని వారు కోరుతున్నారు.


జాప్యం తగదు



అవసరాల కోసం దాచుకున్న జీపీఎఫ్ డబ్బులను ఎప్పటికప్పుడు విడుదుల చేయాలి. పదకొండు నెలలుగా ఉద్యోగ, ఉపాధ్యాయులకు మంజూరై ఉన్న డబ్బులను కారణాలు లేకుండా జాప్యం చేయడం తగదు. త్వరగా బిల్లులు క్లీయర్ అయ్యేలా చూడాలి.

- సుంకరి కృష్ణ, పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి

త్వరగా మంజూరు చేయాలి




అత్యవసరం సమయంలోనే జీపీఎఫ్ లోన్లు, పార్ట్‌ఫైనల్‌కు దరఖాస్తు చేస్తారు. సకాలంలో మంజూరు కాకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రతిసారి బిల్లుల మంజూరు నెలల తరబడి ఎదురుచూడాల్సి రావడం బాధకరం. కొత్త సర్కార్ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలి.

- వెంకట్‌రాంరెడ్డి, టీపీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి

ఆపద్బాంధవులు.. ఆ నలుగురు

- ఎవరికి కష్టం వచ్చినా వాలిపోయి స్పందించే గుణం
- సోషల్ మీడియా ద్వారా అన్నార్థుల దీనస్థితిని వివరించి విరాళాల సేకరణ


చేర్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో ఏర్పాటుచేసిన బేబీ ఫీడింగ్ క్యాబిన్


అనాధ దివ్యాంగ యువకులను సంరక్షణ కేంద్రానికి అప్పగిస్తున్న సతీశ్, రాము, తాహీర్

చేర్యాల, ఫిబ్రవరి 25: మూడుపదుల వయసులేదు కాని వారు మానవత్వానికి ప్రతీకగా నిలుస్తున్నారు. ఎవరికి కష్టం వచ్చినా తమ కష్టంగా భావించి అపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్న వారికి సహాయాన్ని అందిస్తూ ఆపద్బాంధువులుగా నిలుస్తున్నారు. సోషల్ మీడియా ద్వారా అధికారులు, ప్రజాప్రతినిధులు, మిత్రులకు అన్నార్థుల దీనస్థితిని వివరిస్తూ సహాయాన్ని అందింపచేసి చేయూతనందిస్తున్నారు. వారే చేర్యాలకు చెందిన బుక్క సతీశ్, అయిత రాము, అయిత శంకర్, తాహీర్. వీరిలో బుక్క సతీశ్ ఎంబీఏ పూర్తిచేసి ప్రస్తుతం ఉద్యోగం చేస్తున్నాడు. రాము, శంకర్ కిరాణా కొట్టు నడుపుకుంటున్నారు. తాహీర్ లారీ వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. పేద కుటుంబీకుల్లో ఎవరికి ఇబ్బంది కలిగినా స్పందించి వాట్సాప్, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్, సోషల్ మీడియాలలో పోస్ట్‌చేసి విరాళాలు సేకరింపచేసి నగదు, విద్య, వైద్య పర సహాయాన్ని అందిస్తున్నారు.

చేసిన కార్యక్రమాలు

1. చేర్యాలకు చెందిన దివ్యాంగ యువకులు రాజు, శ్రీను తల్లిదండ్రులను కోల్పోయి అనాథలవడంతో రూ.63 వేలు విరాళాలు సేకరించి పోస్టాఫీస్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ఇరువురి దీనస్థితిపై ట్విట్టర్‌లో ప్రభుత్వ మాజీ ప్రధాన కార్యదర్శి స్మితాసబర్వాల్‌కు పోస్ట్‌చేశారు. ఆమె ఆదేశంతో అధికారులు స్పందించి యువకులను మెదక్ బేతాని సంరక్షణ కేంద్రంలో ఆశ్రయం కల్పించారు.
2. యాదాద్రి-భువనగిరి జిల్లా భువనగిరిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తండ్రిని కోల్పోయిన చిన్నారుల పేరిట రూ.52వేలు ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయించారు. ట్విట్టర్‌లో పోస్ట్‌చేయడంతో యాదాద్రి జిల్లా కలెక్టర్ స్పందించి వారి విద్యకు భరోసా కల్పించారు.
3. హైదరాబాద్ టోలిచౌకికి చెందిన ఐదేళ్ల బాలుడు సయ్యద్ ఇమామ్ అరుదైన వ్యాధి ఆపరేషన్ నిమిత్తం మాజీ మంత్రి కేటీఆర్‌కు ట్విట్టర్‌లో పోస్ట్‌చేయడంతో అందిన వైద్య సహాయం.. బిల్లులో తగ్గింపు
4. మద్దూరు మండలంలోని మోడల్ స్కూల్ విద్యార్థుల ఇబ్బందులపై ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు ట్విట్టర్‌లో ట్వీట్ చేయడంతో ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు
5. చేర్యాల పట్టణంలోని జనగామ-సిద్దిపేట ప్రధాన రహదారి మరమ్మతులు చేయాలని అదనపు కలెక్టర్ ముజామిల్‌ఖాన్‌కు ట్విట్టర్‌లో పోస్ట్‌చేయడంతో మరమ్మతుల నిర్వహణ.
6. హైదరాబాద్ హుస్సేన్‌సాగర్ మాదిరిగా ప్లాస్టిక్ బాటిల్స్ వ్యర్థాల నిల్వకోసం సిద్దిపేట కోమటిచెరువుపై బాటిల్ కలెక్టర్ ఏర్పాటుచేయాలని అదనపు కలెక్టర్‌కు ట్విట్టర్‌లో కోరడంతో ఏర్పాటు
7. చిన్నారులకు పాలు పట్టడానికి ఆర్టీసీ బస్టాండులో మదర్ బేబీ ఫీడింగ్ సెంటర్ ఏర్పాటు చేయించారు. ఇవే కాకుండా వారు ఆపదలో ఉన్నవారికి చాలా సహాయాలు అందిస్తూ ఉన్నారు.

పేదింటి కష్టాలు తెలుసు కాబట్టి అండగా నిలబడాలనుకున్నాం



పేదింటికి చెందిన మాకు కష్టం బాధలు తెలుసు. సమాజంలో జరిగిన ఒక్కో సంఘటన మమ్మల్ని ఒక్కో విధంగా కలిచివేసేలా చేసింది. అందుకే అండగా నిలబడి మనోధైర్యం కల్పించాలనుకున్నాం. చేతనైన సహాయం చేస్తూనే అవసరం ఉన్నవారికి తోడ్పాడునందించాలనుకున్నాం. అన్నివర్గాల నుంచి ఆశించిన స్పందన వచ్చింది. మమ్మల్ని ప్రోత్సహించడంతో పదిమందికి సేవచేసిన సంతృప్తి కలుగుతుంది.

- బుక్క సతీశ్‌గుప్తా

ఇప్పటివరకు 15 కుటుంబాలకు ఆర్థికసహాయం అందించాం



సుమారు ఏడాది క్రితం రూ.5 వేలు ఆర్థిక సహాయంతో మొదలు పెట్టాం. మిత్రులు బుక్క సతీశ్, తాహేర్ తదితరులు సోషల్ మీడియాలో పోస్టింగ్స్ చేయడంతో మానవతావాదులందరూ విరాళాలు పంపించారు. వాటితో ఇప్పటివరకు పలు కారణాల ద్వారా ఇబ్బందిపడిన 15 కుటుబాలకు రూ.7 లక్షల మేర ఆర్థిక సహాయం చేశాం. పలు ఫౌండేషన్ల సహాయంతో విద్యార్థులకు మెటీరియల్స్ సహాయం అందింపజేశాం.

- అయిత రాము

విద్యారంగంపై ప్రభుత్వం దృష్టి సారించాలి



మాట్లాడుతున్న మామిడికాయల పరుశురాం

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 25: విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మామిడికాయల పరశురాం కోరారు. సంగారెడ్డిలోని టీపీటీఎఫ్ కార్యాలయంలో ఆదివారం పీడీఎస్‌యూ ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 26, 27 తేదీల్లో సంగారెడ్డిలో రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యాగోష్టి, సంస్థాగత కార్యక్రమాలపై కౌన్సిల్‌లో చర్చించనున్నట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై ఎండగడుతూ పోరాటాల కార్యాచరణను ప్రకటించనున్నట్లు పేర్కొన్నారు. గత బీఆర్ఎస్ సర్కారు విద్యారంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసిందని విమర్శించారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ సర్కారు కాలయాపన చేయకుండా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సురేశ్, కోశాధికారి వెంకట్‌రెడ్డి, నాయకులు రియాజ్, నాగరాజు, నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


కొమురవెల్లి మల్లన్న ఆలయ పరిసరాలలో భక్తుల రద్దీ

కొమురవెల్లిలో భక్తజన సందోహం

- 6వవారం జాతరకు తరలివచ్చిన భక్తులు
- పట్నాలు రచించి, బోనాల నివేదన

చేర్యాల, ఫిబ్రవరి 25: కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆరో వారాన్ని పురస్కరించుకుని ఆదివారం భక్తులు భారీగా తరలివచ్చారు. తలనీలాలు సమర్పించి కోనేరులో పుణ్యస్నానమాచరించారు. భక్తిప్రపత్తులతో బోనం నివేదించి పట్నాలు రచించారు. స్వామివారిని దర్శించుకుని పట్టువస్త్రాలు, బండారి, ఒడిబియ్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. తమను చల్లగా కాపాడుమని వేడుకున్నారు. తమ కోరికలు ఈడేర్చమని వేడుకుంటూ గంగరేగుచెట్టుకు ముడుపులుకట్టారు. భక్తుల రద్దీ అధికంగా ఉండటంతో వీవీఐపీ, ప్రత్యేక ఉచిత దర్శన క్యూలైన్లలో బారులుతీరారు. స్వామివారి దర్శనానికి 3 గంటల పాటు సమయం పట్టడంతో ఇబ్బందులు పడ్డారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేపట్టగా, సీఐ శ్రీను, ఎస్ఐ నాగరాజు బందోబస్తు నిర్వహించారు.

ఏడుపాయల కిటకిట

పాపన్నపేట, ఫిబ్రవరి 25: ఏడుపాయల దుర్గామాతను భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం దర్శించుకున్నారు. మంజీరా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారి దర్శనంకోసం బారులుతీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. బోనాలు నివేదించి, ఒడిబియ్యం పోసి, తలనీలాలను సమర్పించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ పాలకమండలి, సిబ్బంది చర్యలు చేపట్టారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పాపన్నపేట పోలీసులు బందోబస్తు నిర్వహించారు.


పట్నంవేసి మొక్కులు తీర్చుకుంటున్న భక్తులు


కిక్కిరిసిన గంగిరేగుచెట్టు ప్రాంగణం


పాపన్నపేట: అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

నర్సాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై ఆశలు

- రెండు మండలాల కాంగ్రెస్ అధ్యక్షుల ప్రయత్నాలు



నర్సాపూర్ మార్కెట్ యార్డు కార్యాలయం

నర్సాపూర్, ఫిబ్రవరి 25: మెదక్ జిల్లా నర్సాపూర్ నియోజకవర్గ స్థాయిలో ఎంతో కీలకమైన నర్సాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై కాంగ్రెస్ నాయకులు ఆశలు పెట్టుకున్నారు. చైర్మన్ పదవి కోసం ఇక్కడి నాయకులు ప్రయత్నాలు మొదలుపెట్టారు. చైర్మన్ పదవీ బీసీ జనరల్‌కు రిజర్వుకావడంతో నియోజకవర్గంలోని రెండు మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు తమ ప్రయత్నాలు సాగిస్తున్నారు. వారిలో నర్సాపూర్ మండలాధ్యక్షుడు జి.మల్లేశం, శివ్వంపేట మండలాధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ ఉన్నారు. ఇప్పటికే తమ మనసులోని మాటను నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌కు తెలిపినట్లు సమాచారం. వారిని మచ్చిక చేసుకోవడానికి ఎవరికి వారు పావులు కదుపుతున్నారు. వీరితో పాటు మరికొందరు బీసీ నాయకులు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు.

28న ఖేడ్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక?

- చైర్మన్‌గా ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్ చైర్మన్‌గా దారం శంకర్!

నారాయణఖేడ్, ఫిబ్రవరి 25: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మున్సిపాలిటీలో ఈ నెల 2న చైర్మన్, వైస్ చైర్మన్లపై కాంగ్రెస్ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నెగ్గింది. ఈ క్రమంలో ఈ నెల 28న చైర్మన్, వైస్ చైర్మన్ల ఎన్నిక నిర్వహించనున్నట్లు తెలిసింది. చైర్మన్‌గా ఆనంద్ స్వరూప్‌షెట్కార్, వైస్ చైర్మన్‌గా దారం శంకర్‌ను ఎన్నుకునే అవకాశం ఉన్నది. మున్సిపల్ చైర్మన్, వైఎస్ చైర్మన్ల ఎన్నికకు సంబంధించి అధికారికంగా ఉత్తర్వులు రావాల్సి ఉన్నది.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో మిర్జాపల్లి విద్యార్థుల ప్రతిభ


కరాటే పోటీల్లో పతకాలు సాధించిన మిర్జాపల్లి పాఠశాల విద్యార్థులు

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 25: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఆదివారం జరిగిన 5వ రాష్ట్రస్థాయి కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో చిన్నశంకరంపేట మండలం మిర్జాపల్లి గ్రామ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి 8 గోల్డ్ మెడల్, 11 కాంస్య, 4 రజత పతకాలు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు పుష్పవేణి, కరాటే మాస్టర్ కిషన్ మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించడం గర్వకారణమన్నారు.

‘బాల సాహిత్యం’లో కారుణ్యకు ప్రథమ బహుమతి


బాలసాహిత్యంలో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి స్వీకరిస్తున్న కారుణ్య

తూప్రాన్, ఫిబ్రవరి 25: అక్షర కౌముది సాహితీ సాంస్కృతిక సంస్థ 4వ వార్షికోత్సవం సందర్భంగా రాష్ట్రస్థాయిలో ‘బాలసాహిత్యం’ అనే అంశంపై శనివారం ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తూప్రాన్ గీతా స్కూల్ విద్యార్థిని సీహెచ్.కారుణ్య ప్రథమస్థానంలో నిలిచి, బహుమతి పొందింది. ఆదివారం మల్కాజిగిరి సమతా గోపాల్ కళా నిలయంలో నిర్వహించిన బహుమతుల ప్రదానోత్సవంలో ప్రముఖ రచయిత్రి వురిమళ్ల సునంద చేతులమీదుగా బహుమతి అందుకున్నది. ఈ సందర్భంగా విద్యార్థినిని కరస్పాండెంట్ రామాంజనేయులు, చైర్‌పర్సన్ పి.ఉష, డైరక్టర్లు రాఘవేందర్‌గౌడ్, నారాయణగుప్తా, ప్రిన్సిపాల్ వెంకటకృష్ణారావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రేంరాజ్ అభినించారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి


కరంకంటే నిర్మల(ఫైల్)

చేగుంట, ఫిబ్రవరి 25: గుర్తు తెలియని వాహనం ఢీకొన్న ఘటనలో మహిళ మృతిచెందింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా దుబ్బాక గ్రామానికి చెందిన కరంకంటే కిషన్, నిర్మల(38) కామారెడ్డి జిల్లా కంచర్ల మల్లారెడ్డి గ్రామంలోని తన బంధువుల ఇంటికి శుభకార్యానికి ద్విచక్ర వాహనంపై వెళ్లి తిరిగి ఆదివారం రాత్రి హైదరాబాద్‌కు వెళ్తున్నారు. చేగుంట మండలం వడియారం బైపాస్ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో నిర్మల తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. భర్త కిషన్‌కు స్వల్ప గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

- వచ్చేనెలలో పెళ్లి.. ఇంతలోనే విషాదం

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 25: విద్యుదాఘాతంతో యువకుడు మృతిచెందాడు. ఈ సంఘటన సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం చోటు చేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌కు చెందిన రాజు లిలరే(26) సిద్దిపేట పట్టణంలో మెదక్ రోడ్‌లో ఓ ప్రైవేట్ వెంచర్‌లో లేబర్‌గా పనిచేస్తున్నాడు. ఆ వెంచర్ వారు ప్రకటన కోసం ఎల్ఈడీ లైట్లతో కూడిన హైడ్రోజన్ బెలూన్‌ను ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి వీచిన గాలికి ఆ బెలూన్ తెగి పక్కనే ఉన్న 220 కేవీ హైటెన్షన్ వైర్లపై పడింది. అక్కడే గుడిసెలో నిద్రిస్తున్న రాజు లిలరేపై ఎల్ఈడీ వైరు పడడంతో విద్యుదాఘాతంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి వచ్చేనెలలో పెళ్లి జరగాల్సి ఉన్నదని, ఆలోపే ఘోరం జరిగిందని బంధువులు విలపించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మరో ఘటనలో కార్మికుడు..


మృతిచెందిన పరశురాములుగౌడ్

కొండపాక, ఫిబ్రవరి 25: విద్యుదాఘాతంతో కల్లుగీత కార్మికుడు మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని జప్తినాచారం గ్రామంలో శనివారం చోటుచేసుకున్నది. పరశురాములుగౌడ్(46) శనివారం రాత్రి స్నానం చేసిన అనంతరం దుస్తులను మెట్ల వద్ద ఉన్న ఇనుప పలకపై వేస్తున్న క్రమంలో విద్యుదాఘాతంతో కింద పడిపోయాడు. ఆయనను 108లో సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలి

● ఏసీపీ బాలాజీ



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీపీ బాలాజీ

గజ్వేల్, ఫిబ్రవరి 25: పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా ప్రవర్తించాలని గజ్వేల్ ఏసీపీ బాలాజీ సిబ్బందికి సూచించారు. ఆదివారం ఆయన బేగంపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి పెండింగ్ కేసుల వివరాలను ఏఎస్ఐ రాజును అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన పలు సూచనలు తెలియజేశారు. ప్రతీ దరఖాస్తుకు తప్పనిసరిగా రసీదు ఇవ్వాలని, సీసీటీఎన్ఎస్‌లో ప్రతీరోజు డాటా ఎంట్రీ చేయాలన్నారు. అధికారులు, సిబ్బంది ఎప్పటికప్పుడు నూతన టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని సూచించారు. బేగంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని సీసీ కెమెరాలను గురించి ఆరాతీశారు. గంజాయి, మత్తుపదార్థాలు, రవాణాపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేయాలని చెప్పారు. ఇసుక, రేషన్ బియ్యం అక్రమరవాణాను అరికట్టాలన్నారు. పాఠశాలల్లో సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు.

రోడ్లపైనే వారాంతపు సంత

● దుబ్బాకలో మార్కెట్ లేక రహదారిపైనే విక్రయిస్తున్న వ్యాపారులు

● రాకపోకలకు అంతరాయం



దుబ్బాకలో రహదారిపైనే కూరగాయలు, పండ్లను విక్రయిస్తున్న వ్యాపారులు

దుబ్బాక, ఫిబ్రవరి 25: దుబ్బాకలో కూరగాయల మార్కెట్ లేకపోవడంతో వ్యాపారులకు, జనాలకు ఇబ్బందులు తప్పడం లేదు. కూరగాయల మార్కెట్ కోసం గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.4 కోట్లు వృథా అయ్యాయి. ఫలితంగా దుబ్బాకలో మార్కెట్ సౌకర్యం లేక వారాంతపు సంతను రహదారిపైనే సాగిస్తున్నారు. దుబ్బాక-లచ్చపేట, పెద్దచీకోడు, దుంపలపల్లి, మల్లాయపల్లి, చెల్లాపూర్ రోడ్లు శనివారం రాగానే కూరగాయాల మార్కెట్లుగా మారిపోతున్నాయి. పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహం చౌరస్తాలో జరిగే వారాంతపు సంతకు సరైన సౌకర్యాలు కల్పించడం లేదు. రెండు దశాబ్దాల క్రితం దుబ్బాకలో ప్రారంభమైన వారాంతపు సంతకు ఇప్పటికి సరైన వసతులు కల్పించలేకపోయారు. సంతకు వచ్చే రైతులు, వ్యాపారులు, ప్రజలకు కనీస వసతులు కరువయ్యాయి. మరుగుదొడ్లు నిర్మించినా అవి కూడా నిరుపయోగంగా మారాయి. రోజువారి సంత కూడా ఇక్కడే ఉండడంతో తాత్కాలికంగా పెద్దచెరువు కట్టపై షెడ్లను నిర్మించారు. అయితే పట్టణం నుంచి వచ్చే మురుగు ఈ చెరువుకు అనుసంధానం చేశారు. రోగకారక క్రిములు కూరగాయలపై వాలే అవకాశం లేకపోలేదు. దుర్వాసన తట్టుకోలేక అమ్మకందారులు, కొనుగోలుదారులు అవస్థలు పడుతున్నారు. దోమల బెడద కూడా అధికంగా ఉంది.

ఆదాయమున్నా.. అవస్థలే

రైతుబజార్ ద్వారా దుబ్బాక మున్సిపాలిటీకి సుమారు రూ.10లక్షల ఆదాయం వస్తున్నది. శని, ఆదివారాల్లో రూ.50వేల వరకు ఆదాయం సమకూరుతున్నది. ఇంత ఆదాయం వస్తున్నా సంతలో కనీస వసతులు కల్పించడంలో విఫలమయ్యారు. ఇక గత ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా కూరగాయల మార్కెట్ ఏర్పాటుకు స్థల సేకరణలో ఇబ్బందులు ఎదురవ్వడంతో ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది.

చికిత్స పొందుతూ హెడ్ కానిస్టేబుల్ మృతి



తిరుపతి మృతదేహానికి నివాళులర్పిస్తున్న అధికారులు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 25: సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ నందు స్పెషల్ బ్రాంచ్‌లో పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ గోవిందారం తిరుపతి అనారోగ్యంతో సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. పోలీస్ కమిషనర్ డాక్టర్ బి.అనురాధ కుటుంబ సభ్యులతో ఫోన్లో మాట్లాడి పరామర్శించారు. హెడ్ కానిస్టేబుల్ అకాల మరణానికి సంతాపం వ్యక్తం చేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. డిపార్ట్మెంట్ తరఫున రావలసిన అన్ని బెనిఫిట్స్ త్వరలోనే కుటుంబ సభ్యులకు అందజేస్తామని తెలిపారు. ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ రెడ్డి, మిరుదొడ్డి ఎస్ఐ పరుశురామ్, దుబ్బాక ఎస్ఐ గంగరాజు, భూంపల్లి ఎస్ఐ భువనేశ్వర్, చిన్నకోడూర్ ఎస్ఐ బాలకృష్ణ, పోలీస్ అధికారులు సిబ్బంది తిరుపతి స్వస్థలం మిరుదొడ్డి మండలం కాసులాబాద్ గ్రామానికి వెళ్లి మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు, అంత్యక్రియల కోసం ప్రభుత్వం తరఫున రూ.20,000 అందజేశారు.

నేడు హుస్నాబాద్ మున్సిపల్ బడ్జెట్ సమావేశం

● హాజరుకానున్న మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, ఫిబ్రవరి 25: హుస్నాబాద్ మున్సిపల్ అంచనా బడ్జెట్ సమావేశం సోమవారం నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సమావేశానికి రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరుకానున్నారు. అలాగే మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు. సోమవారం ఉదయం 9 గంటలకు రూ. 2.5 కోట్లతో నిర్మించే హుస్నాబాద్ నుంచి మహ్మదాపూర్ రోడ్డుకు శంకుస్థాపన, 10 గంటలకు పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో సన్‌ఫ్లవర్ కొనుగోలు కేంద్రం ప్రారంభం, మధ్యాహ్నం 2 గంటలకు పొట్లపల్లి రాజేశ్వరస్వామి దేవాలయంలో శివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష, రాత్రి 7.30 గంటలకు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారని మంత్రి కార్యాలయ అధికారులు తెలిపారు.

'ఎన్‌హెచ్‌ఆర్‌సీ' మండలాధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాస్

కొండపాక, ఫిబ్రవరి 25 : జాతీయ మానవ హక్కుల కమిటీ ఆదేశాల మేరకు కుకునూర్‌పల్లి మండల అధ్యక్షుడిగా లకుడారానికి చెందిన వై. శ్రీనివాస్‌రెడ్డిని నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని జిల్లా అధ్యక్షుడు బద్దిపడిగ నర్సింహారెడ్డి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఆర్‌సీ సంస్థ అవినీతి, అక్రమాలపై పోరాటం చేస్తుందన్నారు. లీగల్ ప్రొసీజర్‌తో మానవ హక్కుల ఉల్లంఘనను నిరోధించడానికి నిస్వార్థంగా పని చేస్తుందన్నారు. నూతనంగా ఎన్నికైన శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో ఈ పదవి ఇచ్చిన నేషనల్ చైర్మన్ యాసీన్, రాష్ట్ర అధ్యక్షుడు బద్దిపడిగ శ్రీనివాస్‌రెడ్డికి, సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బద్దిపడిగ నర్సింహారెడ్డికి, కొమురవెల్లి మండల అధ్యక్షుడు బోదుగం కృష్ణారెడ్డి ,కొండపాక మండల అధ్యక్షుడు పి.బాల్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

బ్యాంకుల ప్రైవేటీకరణ నిర్ణయం సరైనది కాదు

● యూబీఏఈయూటీఎస్ నాయకులు



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న నాయకులు

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 25: బ్యాంకుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని యూబీఏఈయూటీఎస్ చైర్మన్ రవీంద్రనాథ్ అన్నారు. ఆదివారం సిద్దిపేటలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిద్దిపేట రీజినల్ ఎంప్లాయీస్ యూనియన్ కాన్ఫరెన్స్ కార్యక్రమానికి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముక్త కంఠంతో బ్యాంకుల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఖండిస్తున్నామన్నారు. దానితో పాటు బ్యాంకుల్లో పని ఒత్తిడి ఎక్కువగా ఉందని, సరైన సంఖ్యలలో పర్మినెంట్ ఉద్యోగుల నియామకం చేపట్టాలని డిమాండ్ చేశారు. ప్రధాన కార్యదర్శి సమద్‌ఖాన్ మాట్లాడుతూ.. మన యూనియన్ ఎప్పుడూ మన సభ్యుల అభివృద్ధికి , సంక్షేమానికి కట్టుబడి ఉందని, ఉద్యోగులకు బ్యాంక్ కల్పిస్తున్న ఆరోగ్య బీమా పథకాన్ని ఎలా సద్వినియోగం చేసుకోవాలో అర్థం అయ్యేలా వివరించామన్నారు. అనంతరం సిద్దిపేట రీజియన్‌కి నాయకులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ వికాస్, వైస్ ప్రెసిడెంట్ ఈశ్వర్, నాయకులు రవీందర్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

కౌన్సిలర్ చిత్తారి పద్మకు సన్మానం

హుస్నాబాద్, ఫిబ్రవరి 25: ఉత్తమ కౌన్సిలర్‌గా బహుజన సాహిత్య జాతీయ అకాడమీ అవార్డు అందుకున్న హుస్నాబాద్ కౌన్సిలర్ చిత్తారి పద్మను ఆదివారం పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సన్మానించారు. ఈ అవార్డు అందుకోవడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో స్ఫూర్తి అసోసియేషన్ అధ్యక్షుడు పందిల్ల శంకర్, మల్కిరెడ్డి మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ కేడం లింగమూర్తి, ఎక్సైజ్ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్, వీరేశం, చిత్తారి రవీందర్, బూట్ల రాజమల్లయ్య, మల్కిరెడ్డి మాధవి తదితరులున్నారు.

భక్తి శ్రద్ధలతో షబే బరాత్

మద్దూరు, ఫిబ్రవరి 25 : మద్దూరు, ఉమ్మడి మండలంలోని గ్రామాల్లో షబే బరాత్‌ను ముస్లీం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మద్దూరులో మజీద్ కమిటీ అధ్యక్షుడు షకీల్ ఆధ్వర్యంలో పలువురు మరణించిన వారి కుటుంబ సభ్యుల సమాధుల వద్ద పూలు చల్లి ప్రార్థనలు చేశారు. అనంతరం మజీదులో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మరణించిన వారి ఆత్మశాంతి కోసం ఒక రోజు మెలుకువగా ఉంటున్నట్లు ముస్లీం సోదరులు తెలిపారు.

కుటుంబాన్ని పరామర్శించిన చెరుకు శ్రీనివాస్‌రెడ్డి

మిరుదొడ్డి, ఫిబ్రవరి 25: అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్‌పార్టీ సీనియర్ నాయకుడు అబిద్ తండ్రి రహిమ్మద్ అనారోగ్యంతో ఆదివారం మృతిచెందాడు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్‌పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, భౌతికాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ దుబ్బాక అధ్యక్షుడు వెంకటస్వామిగౌడ్, ఎంపీటీసీ ఉమారాణిబాలాగౌడ్, నాయకులు బాలు, ప్రభాకర్‌చారి, సుమలత, అనిల్, యాదగిరి, బాల్‌రాజు, విజయ తదితరులున్నారు.

సమాజసేవే అలయన్స్ క్లబ్ లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న సోమ వనజ

సిద్దిపేటరూరల్, ఫిబ్రవరి 25: సమాజసేవ చేయడమే అలయన్స్ క్లబ్ లక్ష్యమని జిల్లా గవర్నర్ సోమ వనజ తెలిపారు. ఆదివారం సిద్దిపేటలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అలయన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సామాజిక సేవలు నిర్వహించామని, ముందు కూడా మరిన్ని సేవా కార్యక్రమాలతో ఆదరణ పొందుతామన్నారు. అలయనన్స్ క్లబ్ అనేది పూర్తిగా దేశీయ క్లబ్ అని చెప్పారు. సంవత్సరం నుంచి సుమారు 400 సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. నిరుపేద వధూవరులకు పెళ్లి చేయడం, సామూహిక శ్రీమంతాలు, రక్తదాన శిబిరం, వృద్ధులకు దుప్పట్లు, పండ్ల పంపిణీ వంటి అనేక సేవా కార్యక్రమాలు చేసినట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యాశాఖ అధికారుల సహకారంతో సైన్స్ క్విజ్ పోటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో క్లబ్ ప్రతినిధులు ఆత్మ రాములు, పెద్ది వైకుంఠం, సోమ శివకుమార్, అంజయ్య, పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల సిల్వర్‌జూబ్లీ సమ్మేళనం



సిల్వర్‌జూబ్లీ వేడుకల్లో పాల్గొన్న పూర్వవిద్యార్థులు

దుబ్బాక, ఫిబ్రవరి 25: దుబ్బాక మండలం తిమ్మాపూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఆదివారం 1998-99 బ్యాచ్ విద్యార్థులు సిల్వర్ జూబ్లీ సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులు బాలకిష్టయ్య, లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి, ఉమాదేవి, సరళ, మధుసూదన్‌రెడ్డిలను శాలువతో సన్మానించారు.

ఐదుతరాల కుటుంబసభ్యుల ఆత్మీయ సమ్మేళనం



ఒక చోట చేరిన ఐదుతరాల కుటుంబీకులు

చిన్నకోడూరు, ఫిబ్రవరి 25: చిన్నకోడూరు మండల కేంద్రానికి చెందిన కనుగుల మల్లమ్మ- ఎల్లయ్య దంపతుల కుమారులు, కోడళ్లు, కూతుళ్లు, అల్లుళ్లు, మనుమలు, మనుమరాళ్లు, మునిమనుమలు మనుమరాళ్లు ఇలా ఐదుతరాల కుటుంబ సభ్యులు ఆదివారం మండలంలోని పెద్దకోడూరులో ఉన్న ఓ ఫంక్షన్ హాల్‌లో (139 మంది) ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని, సహపంక్తి భోజనాలు చేశారు.

ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శ



పరామర్శిస్తున్న మాజీమంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 25 : సిద్దిపేట నియోజకవర్గంలో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు పలు కుటుంబాలను పరామర్శించారు. సిద్దిపేట పట్టణానికి చెందిన పార్టీ సీనియర్ నాయకుడు జంగిటి నర్సింహులు తల్లి ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబాన్ని పరామర్శించారు. తడకపల్లి గ్రామానికి చెందిన పార్టీ యువజన విభాగం సీనియర్ నాయకుడు అంబటి మహేష్ గౌడ్ కూతురు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. వారి కుటుంబసభ్యులను పరామర్శించి, అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. సిద్దిపేట పట్టణానికి చెందిన యువజన విభాగం నాయకుడు చేపూరి శేఖర్ గౌడ్ తండ్రికి ఇటీవల గుండె ఆపరేషన్ కాగా శంకర్ నగర్‌లోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు

రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ఎస్ఐ, ప్రవీణ్‌రెడ్డి

అల్లాదుర్గం, ఫిబ్రవరి 25: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, రోడ్డు నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపే వారిపై చర్యలు తీసుకుంటామని అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ స్థానిక సీఐ రేణుకతో కలసి స్పెషల్ డ్రైవ్‌తో వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. రహదారులపై రాంగ్ రూట్‌లో ప్రయాణించి ప్రమాదాలను తెచ్చుకోవద్దని సూచించారు. ద్విచక్రవాహన చోదకులు విధిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడిపినా, నంబరు ప్లేట్ లేనివాటిని మోటార్ వెహికల్ యాక్ట్ ప్రకారం సీజ్ చేస్తామని ఎస్ఐ హెచ్చరించారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి



సదస్సులో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మైపాల్

జహీరాబాద్, ఫిబ్రవరి 25: పరిశ్రమల్లో ఏళ్లతరబడి పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని సీఐటీయూ జిల్లా సహాయకార్యదర్శి మైపాల్ పేర్కొన్నారు. ఆదివారం జహీరాబాద్ సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశ్రామిక క్లస్టర్ కాంట్రాక్టు వర్కర్ల సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమల్లో శాశ్వత స్వభావంలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలన్నారు. కార్మిక చట్టాలను అమలుచేయని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జహీరాబాద్ ప్రాంతంలోని పరిశ్రమల్లో కార్మికులు ఎక్కువగా కాంట్రాక్టు ప్రాతిపదికన పని చేస్తున్నారన్నారు. కర్మాగారాల్లో కాంట్రాక్టు కార్మికులను యాజమాన్యాలు శాశ్వతస్వభావం గల పనుల్లో వినియోగిస్తున్నాయన్నారు. కార్మికులకు వ్యతిరేకంగా ఉన్న జీవోలను వెంటనే రద్దుచేసి కనీసవేతనాలు ఇచ్చేలా పాలకులు చొరవచూపాలని ఆయన కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు సందీప్‌రెడ్డి, నరేష్, విజయకుమార్, మల్లేశం, పాండురంగారెడ్డి పాల్గొన్నారు.

402వ వారం స్వచ్ఛభారత్

తూప్రాన్, ఫిబ్రవరి 25: తూప్రాన్ మండలం మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో ఆదివారం 402వ వారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తాలో సీసీ రోడ్డుపై చెత్తను చీపుర్లతో ఊడ్చి శుభ్రం చేశారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచు పంజాల ఆంజనేయులుగౌడ్, మెకిన్ మల్కాపూర్ యువత, మహిళలు, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు బీజేపీ కార్యకర్తల సమావేశం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 25: విజయ సంకల్ప యాత్ర విజయవంతానికి ఈ నెల 26న సాయంత్రం నారాయణఖేడ్‌లోని సాయిబాబాఫంక్షన్‌హాల్‌లో నియోజకవర్గ బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నామని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ రజనీకాంత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి జిల్లా అధ్యక్షురాలు గోదావరి అంజిరెడ్డి హాజరవుతారన్నారు. రాష్ట్ర నాయకులు, జిల్లాపదాధికారులు, మండల బాధ్యులు, యాత్ర కమిటీ సభ్యులు, శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు, బీజేపీ సీనియర్ నాయకులు హాజరు కావాలని కోరారు.

ప్రెస్ అకాడమీ చైర్మన్ నియామకంపై హర్షం

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 25: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్‌గా కె శ్రీనివాస్‌రెడ్డిని నియమించడం పట్ల టీయూడబ్ల్యూజే మెదక్ జిల్లా అధ్యక్షుడు శంకర్‌దయాళ్‌చారి, సుధాకర్, ఐజేయూ సభ్యులు, కంది శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర దాడుల వ్యతిరేక కమిటీ సభ్యులు మిన్పూర్ శ్రీనివాస్, అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు బుక్క అశోక్ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యమ నేతను నియమించడం సంతోషకరమన్నారు.

మేడాలమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజ కార్యక్రమంలో భక్తులు

గుమ్మడిదల , ఫిబ్రవరి 25: మండలంలోని నల్లవల్లి మేడాలమ్మ ఆలయం 19 వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం ఆలయంలో అభిషేకం, అర్చనతో పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం శాస్త్రోక్తంగా అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అటవీ ప్రాంతంలో వెలిసిన మేడాలమ్మ వార్షిక మహోత్సవాన్ని తిలకిచ్చేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తజనంతో నిండిపోయింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అమ్మవారి దర్శించుకునేందుకు ఆలయకమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులందరికీ ఆలయ కమిటీ చైర్మన్ సంజీవరెడ్డి ఆధ్వర్యంలో ట్రస్టు సభ్యులు అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు సభ్యులు గోల్కొండ బాల్‌రెడ్డి, చిమ్ముల మహిపాల్ రెడ్డి, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, సత్యనారాయణ, మాజీ సర్పంచ్ చిమ్ముల నరసింహారెడ్డి, కుల పెద్దలు పాల్గొన్నారు.

నిజాంపేటలో ఉచితవైద్య శిబిరం

నారాయణఖేడ్, ఫిబ్రవరి 25: నిజాంపేటలో ఆదివారం మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలోని న్యూశివదత్త వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించారు. వైద్యులు అనిల్ గౌడ్, కరిష్మా, సిబ్బంది నవీన్‌గౌడ్, నిఖిల్, శ్రీనివాస్, మహానంద తదితరులు సుమారు 250 మందికి వివిధ వైద్య పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, మాజీ సర్పంచు జగన్‌చారి, మాజీ ఉప సర్పంచు రాజీబాయిరాంచందర్‌రావు పాల్గొన్నారు.

తునికి నల్ల పోచమ్మను దర్శించుకున్న నీలం మధు

కౌడిపల్లి, ఫిబ్రవరి 25: తునికి నల్ల పోచమ్మ ఆలయంలో ఆదివారం కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోనికి వచ్చినప్పటి నుంచి ప్రజల కోసం నిరంతరం పనిచేస్తూ ఆరు గ్యారెంటీల అమలు కోసం పని చేస్తుందని అన్నారు.

బీజేపీ జిన్నారం మండల కార్యవర్గం ఎన్నిక



బీజేపీ నూతన కార్యవర్గ సభ్యులు

జిన్నారం, ఫిబ్రవరి 25: జిన్నారం మండల బీజేపీ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పార్టీ మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి తెలిపారు. ఆదివారం జిన్నారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడు జగన్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా కమ్మరి కృష్ణ, రాజుగౌడ్, సుధాకర్, సంతోష్‌కుమార్, ప్రధాన కార్యదర్శులుగా వెంకటేశ్, మాద్దూరి రాజు, కార్యదర్శులుగా సీతారాజు, పద్మారావు, నరసింహ, లక్ష్మన్, మహేష్ ఎన్నికయ్యారు, కోశాధికారిగా ఎల్లేష్, మహిళా మోర్చా అధ్యక్షురాలిగా కట్టా లక్ష్మీ, కిసాన్ మోర్చా అధ్యక్షుడిగా వెంకటేశ్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా, మండల నాయకులు ప్రతాప్‌రెడ్డి, నర్సింగ్‌రావు, రమేష్, రాజిరెడ్డి, భార్గవ్, ఆదిత్య, వినయ్ పాల్గొన్నారు.

కార్మికుల సంక్షేమానికి 'ఐఎన్‌టీయూసీ' కృషి

జిన్నారం, ఫిబ్రవరి 25: పారిశ్రామిక రంగంలోని కార్మికుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి ఐఎన్‌టీయూసీ కృషి చేస్తుందని జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం బొల్లారం మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఐఎన్‌టీయూసీ కార్యాలయాన్ని నర్సింహారెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మారెడ్డి, పట్టణ అధ్యక్షుడు శివసాయి, నాయకులు ఇమ్రాన్, సంతోష్, లక్ష్మన్, కిరణ్, తిరుపతి పాల్గొన్నారు

మధ్యలోనే నిలిచిన రహదారి నిర్మాణ పనులు

● బిల్లులు ఇవ్వడం లేదంటూ చేతులెత్తేసిన కాంట్రాక్టర్

● అవస్థలు పడుతున్న వాహనదారులు

● పరిష్కరించకుంటే ఉద్యమిస్తామని హెచ్చరిక



పుల్లూరులో అసంపూర్తిగా నిలిపివేసిన రోడ్డు నిర్మాణం

సిద్దిపేట రూరల్, ఫిబ్రవరి 25: ఊరికి వెళ్లాలంటే నరకం చూడాల్సి వస్తున్నదని సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు గ్రామస్థులు వాపోతున్నారు. సిద్దిపేట ముస్తాబాద్ రహదారి పుల్లూరు కమాన్ నుంచి పుల్లూరు గ్రామంలోకి వెళ్లేందుకు గల రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించి మధ్యలోనే వదిలేశారు. సుమారు రెండు కిలోమీటర్ల వరకు గల రోడ్డుకు ఇరువైపులా కంకర పరిచిన కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదంటూ చేతులెత్తేశాడు. దాంతో ఆ రోడ్డుపై ప్రయాణం చేసిన ప్రతీ ఒక్కరికి నరకం కనిపిస్తున్నది. వాహనాల రాకపోకలతో దుమ్ము లేవడంతో ఇబ్బంది కలుగుతున్నదని ప్రయాణికులు, వాహనదారులు, పాదాచారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కనీసం రోజుకు ఒక్కసారైనా నీళ్లు పోయాలని వారు కోరుతున్నారు. రూ.2.1 కోట్ల మంజూరై రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించివదిలేశారు. అభివృద్ధి పేరిట అవస్థలు కలిగించడం దారుణమని, ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయించాలని డిమాండ్ చేస్తున్నారు.

నిరసనకు దిగుతాం



నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించి పూర్తి చేయాలి, లేదంటే నిరసనకు దిగుతాం. అధికారులు స్పందించకపోతే సంబంధిత ప్రభుత్వ కార్యాలయాన్ని ముట్టడిస్తాం. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలి లేదంటే తగిన రీతిలో ప్రజలు స్పందిస్తారు.

- భరత్ యాదవ్, గ్రామస్థుడు

పైఅధికారులకు సమాచారం ఇచ్చాం

పుల్లూరు రోడ్డు విస్తీర్ణ నిర్మాణ పనులు నిలిచిపోయాయని ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చాం. కాంట్రాక్టర్ ఒప్పందం ప్రకారం నిర్మాణ పనులు చేయాల్సి ఉంటుంది. కానీ బిల్లులు రాలేవని పనులు నిలిపివేయడం సరికాదని కాంట్రాక్టర్‌కి సూచించం. ఉన్నతాధికారుల సహకారంతో నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయిస్తాం.

- శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, పంచాయతీ రాజ్.